


## స్వేచ్ఛా విహారం :

బయట ఆకాశం పిలుస్తోంది పద
చర్చిల శిఖరాలకు మళ్ళీ పెరిగిన
ఆ యూకలిప్టస్ అడవుల్లో పరుగిడదాం పద
ఎక్కడ కెంపులొలికే కెమిలియాలు
నిశ్శబ్ద మాధురిలో నీలినీలి కలలు కంటున్నాయో
ఎక్కడ చెట్లు యవ్వనపు ఆకుల్ని రాలుస్తున్నాయో
ఆ యూకలిప్టస్ అడవుల్లో పరుగిడదాం పద!"
సాయంత్రం సరిగ్గా నాలుగు గంటలకి, అక్కడ
కళ్ళు మూసుకుని జపిస్తుంటాను నీ నామం,
స్వప్నాల తోటలో పాటలా —
ఉదయించాలి నువ్వు నా ముందు!

—రవి.

పదోసారి ఆ ఉత్తరాన్ని చదువుకుని, క్లాసంతా పరికించి చూసింది స్రవంతి. క్లాసులో ఎక్కడా రవి కనిపించలేదు.

ఉదయం తను క్లాసుకి వస్తుండగా పుస్తకంలో పెట్టి అందించాడు ఈ లేఖను. తను చదివి అతని వైపు చూసింది.

కళ్ళతోనే హెచ్చరించాడు 'వస్తావుగా!' అన్నట్లు. తను రానన్నట్టు తలవూపింది.

దీనంగా ముఖం పెట్టి 'ప్లీజ్! రావా?' అన్నట్లు అభ్యర్థించాడు.

తను అంగీకారాన్ని వ్యక్తపరచగానే, తొలకరి మెరుపుల్ని కళ్ళలో నింపుకుని వెళ్ళిపోయాడు.

తరవాత మరి ఏ క్లాసుకీ అటెండ్ కాలేదు.

ఇప్పటి నుండే వెళ్ళి అక్కడ జపం చేస్తుంటాడేమో?

ఆ విషయాన్ని తలుచుకోగానే ఒక వింత అనుభూతితో స్రవంతి తనువంతా పులకించింది.

క్లాసులో ఇంగ్లీష్ లెక్చరర్ షేక్స్పియర్‌ని విద్యార్థుల బుర్రల్లోకి ఎక్కిస్తున్నాడు.

స్రవంతి ఆలోచనలుమాత్రం ...
ఆ సెలయేటి తీరాన
ఆ కొండల సమీపాన
నీలగిరి చెట్ల నీడల్లో
సరుగుడు చెట్ల సంగీతం వింటూ
ఒకరి వెంట ఒకరు పరుగిడుతూ
నవ్వుతూ తుళ్ళుతూ, దారంతా
రాలుతున్న ఆనందాన్నీ, అనుభూతుల్నీ
ఏరుకుంటూ ... తనూ, రవీ ...

ఎక్కడో దూరంగా చర్చి గంటలా బెల్ మ్రోగింది.

క్లాసులో కలకలం రేగింది.

స్రవంతి ఒక సారి వాచీ చూసుకుంది.

సమయం ఇంకా పన్నెండు గంటలే!

ఓహో! ఇంకా నాలుగు గంటల కాలాన్ని ఈ బంధిఖానాలో గడపాలి.

ఆలోచనల్ని యూకలిప్టస్ అడవుల్లోనికి పరుగెత్తించింది.

* * *

"సరుగుడు చెట్ల నీడల్లో
సరదాగా తిరుగుదాం
సంజె ఎరుపు సెలయేటి మీద
చల్లిన తొలి సిగ్గులా ఉంది
ఒక్కసారి ఇల్లు విడిచి

ఉత్సాహంగా రా చెలీ!''

అడుగులకి అడుగులేస్తూ పాదాల మువ్వల్ని ఘల్లుఘల్లు మనిపిస్తూ రవిని వెదుకుతున్న స్రవంతి, తన వెనుక నున్న చెట్ల మధ్య నుండి వినబడిన ఆ గీతానికి ఆగి వెనుదిరిగి చూసింది.

చేతులు చాచి ఆనందపు లోకానికి ఆహ్వాని స్తున్నట్లు ఎదురుగా రవి.

ఒక్క ఉదుటున పరుగిడి అతని చేతుల్లో వాలింది.

క్షణకాలం తరవాత —

ఆ చెట్ల నీడల్లోంచి ఇద్దరూ ఒకరి ప్రక్కన ఒకరు నడుస్తూ

స్రవంతి నడుముచుట్టూ చేయివేసి దగ్గరకి లాక్కుంటూ సృష్టిలోని ఆనందమంతా తన గొంతులో నింపి రవి చెబుతున్నాడు ఏవేవో కబుర్లూ, కవితలూ!

దారంతా చిరునవ్వుల పూలను వెదజల్లుతూ వింటోంది స్రవంతి.

ఏటి ఒడ్డుకు చేరుకుని ఇసుకలో కూర్చున్నారు.

క్షణకాలం వారి మధ్య మౌనం న్యాటమాడింది.

'రవీ!' మౌనాన్ని దూరంగా తరిమేస్తూ పిలిచింది స్రవంతి ... ''ఏదైనా ఒక పాట పాడవూ?''

''ఏం పాడమంటావ్?''

''జయదేవుని అష్టపది ఏదైనా పాడు.''

''అలాగే! కానీ ఒక చిన్న షరతు.''

''ఏమిటో?''

''నీ ఒడిలో నా తల పెట్టుకొని
నీ నీలి శిరోజ తమ సముద్రాలు
పొంగి నీ భుజాలు దాటి
నా ముఖాన్ని కప్పుతూ ...''

''సరే! ఇంక ఆపు ... అలాగే!'' మధ్యలోనే ఆపిం దామె.

రవి ఆమె ఒడిలో తల పెట్టుకుని, సిగ్గిల్లిన పొగ కళ్ళతో అరుణిమ దాల్చిన ఆమె ముఖాల్ని, చిరుగాలికి ముఖంపై నాట్యమాడుతున్న ముంగురుల్ని చూస్తూ ... గీతానికి ఆలాపన అందుకున్నాడు.

ఆమె అరమోడ్పు కన్నులతో వింటోంది.

''యారమితా వనమాలిన ...'' జయదేవుని గీతం రవిగొంతులో ప్రాణం పోసుకొని తీగెలు సాగుతోంది.

''. . . . . .''

''ఎలా ఉంది పాట?''

''నా మోహంలా ఉంది!''

''థాంక్స్! సరైన కాంప్లిమెంట్!''

సిగ్గుపడిపోయింది స్రవంతి.

''బుగ్గల్లో మందారాలు పూశాయి ఏరుకోనా?''

''అబ్బా! ఎంతసేపూ కవిత్వమేనా? ఇవన్నీ చదివీ చదివీ బాగా బుర్ర కెక్కించుకుంటే, ఇంక క్లాసుపుస్తకాలేం ఎక్కుతాయ్?''

''ఆ పనికి రాని చెత్తంతా ఇప్పుడెందుకు? అసలు ఒక కవి ఏమన్నాడో తెలుసా?

ఆనందాన్ని చంపేందుకు
అనంతంగా ఉంది లోకం
కులాసాని చెడగొట్టేందుకు
అలాస్కాదాకా అవకాశముంది
అందుకే—
కొంచెంసేపు స్వప్నం లోకి
గోర్వంకల రెక్కల్తో
ఎగిరిపోదా మన్నీ మరిచి
ఒబద్ధాన్ని ఆశ్రయించిన సుఖం
నిజాన్ని నిరూపించే నరకం కన్న
మెంయ్య రెట్లు నయం — అని.''

విప్పారిన నేత్రాలతో రవిని చూస్తూ అలా ఉండిపోయింది స్రవంతి.

ఆమె నేత్రాలు ప్రసరిస్తున్న వెలుగు కిరణాలతో ఆనందపు టంచుల్ని వెదుక్కుంటూ ఉండిపోయాడు రవి.

''స్రవంతీ!''

''వూ!''

''మనం ఎన్నాళ్ళింకా ఇలా దూర దూరంగా...?''

''దూరం ఏదీ— చాలా దగ్గరగానే ఉన్నామే!''

''ఉహూ! మన మధ్య ఇంకా కొంత దూరం ఉంది.. దాన్ని చెరిపేయాలి... మనం శాశ్వతంగా ఇలా దగ్గరగా ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకుంటూ ఉండాలి మనం వెంటనే పెళ్ళిచేసుకోవాలి!''

''ఆదేమిటి! డిగ్రీ పూర్తి చెయ్యవా? ముందు మన చదువు పూర్తి కావాలి. తరవాత నీకు ఉద్యోగం దొరకాలి. అప్పుడు పెళ్ళి. ఎందుకో తెలుసా?— పెళ్ళికి మన మధ్య అంతస్తుల్ని అడ్డు పెడతాడు మా డాడీ. ముందు మన కాళ్ళ మీద మనం నిలబడగలగాలి. అప్పుడు డాడీని ఎదిరించయినా నీతో నేను రాగలను, ఏమంటావ్?''



''కర్కశంగా, గరుకుగాఉండే పళ్లపొడులు మీ పళ్లకు, చిగుళ్లకు హానికలిగించవచ్చు...''

**కోల్గేట్ టూత్ పౌడర్‌తో మీ చిగుళ్లను, చెడుశ్వాసను కూడా అరికట్టండి పళ్లను కాపాడుకోండి.**




కోల్గేట్ టూత్ పౌడర్ ఎంతో మెత్తగా ఉండే తెల్లని పౌడర్ అది అతి మృదువుగా మీ చిగుళ్ళను తోముతుంది. అంతేగాకుండా దానిలో ఉండే సున్నితమైన మెరుగునిచ్చే పదార్థం మీ పళ్ళ మీది పాచిపొరలను తొలగిస్తుంది. మీ పళ్ళను శుభ్రపరచి తెల్లగా చేస్తుంది. కోల్గేట్‌లోని పుష్కలమైన నురుగునిచ్చే చర్య పళ్ళ సందులలోనికి చొచ్చుకుపోయి చెడు వాసనను దంతక్షయకారకములైన సూక్ష్మ క్రిములను తొలగిస్తుంది
మీ కుటుంబానికి కోల్గేట్ టూత్ పౌడర్‌తో అధునాతనమైన తీరులో దంతరక్షణ సమకూర్చండి. దానియొక్క చల్లని, పిప్పరమెంట్ రుచిని వారంతా మెచ్చుకుంటారు.

TP.G.30TL

"అవును. ముందు డిగ్రీ పూర్తి చెయ్యాలి!" తనలో తను గొణుక్కుంటున్నట్లు అంగీకరించాడు రవి.

తరవాత వారి మధ్య కాలం సెలయేటి గలగల్లాంటి కబుర్లతో దొర్లిపోయింది.

"రేపు ఏదైనా సినిమా కెళదాం" అన్నాడు రవి.

"అలాగే!" అంది స్రవంతి.

## తీయని అనుభవం :

మర్నాడో రెండు రోజుల్లో మారిపోబోతున్న ఇంగ్లీష్ సినిమా అది. ప్రేయసితో కలసి వెళ్ళడానికి ఇంగ్లీష్ సినిమాయే మంచిదని రవి అభిప్రాయం.

హాల్లో అట్టే జనం లేరు. ఉన్న కొద్ది మందీ జంటలు జంటలుగా మూల మూలల్లో కూర్చున్నారు.

వెలుతురు పడని చోట మసక మసక చీకట్లో ఒక మూలగా రవీ, స్రవంతీ కూర్చున్నారు.

తెరమీద బొమ్మలు కదిలిపోతున్నాయి. హీరో హీరోయిన్ల ప్రణయ సన్నివేశం. పాశ్చాత్య సంగీతం మంద్రస్థాయిలో వినిపిస్తోంది. హీరో, హీరోయిన్ని బిగి కౌగిలిలో బంధించి గాఢంగా ముద్దు పెట్టుకుంటున్నాడు.

"అబ్బ! ఇబ్బందిగా ఉండదూ?" కుర్చీలో మెల్లగా కదలి, రవి భుజంపై తలను వాల్చేస్తూ అంది స్రవంతి.

"ఎందుకూ?" తన చేతిని స్రవంతి భుజంపైకి పోనిచ్చి దగ్గరకు జరుపుకుంటూ అన్నాడు రవి.

"మరీ అంత స్పీపా?!" నెమ్మదిగా వినీ వినిపించనట్టు అంది. ఆమె గొంతులో వణుకు స్పష్టమయింది రవికి.

"ఏదీ! ఇటు తిరుగు!" అన్నాడు.

వినిపించనట్టు ఆమె తిరిగింది.

రక్తం పొంగి ఆ మసక చీకట్లో కూడా ఎర్రగా కనిపిస్తోంది ఆమె ముఖం. పెదవులు వణుకుతున్నాయి.

వెంటనే రవి గులాబీ రేకల్లాంటి ఆమె లేత పెదవులపై తన పెదవుల్ని చేర్చి ఒక సున్నితమైన శబ్దాన్ని చేశాడు.

"ఛీ! పాడు. మరీ కొంటెవాడివై పోతున్నావ్" అంటూ అతన్ని తోసేసి కొంచెం దూరం జరిగింది.

"ఇబ్బందిగా ఉంటుందో లేదో తెలుసుకుందామనీ!"

తెరమీద బొమ్మలు బెడ్ వైపు నడిచాయి.

"రవీ! పోదాం!" అంది స్రవంతి.

"ఏం ... సరే! పద" అంటూ లేచాడు.

అతన్ని అనుసరించిందామె.


హాలు ఆవరణ దాటి బయటికొచ్చారు.

ఆకాశంలో తారలు మినుకు మినుకుమంటున్నాయి.

అమావాస్య రాత్రులు కావడంతో చంద్రుడు దాగుడు మూతలు ఆటకు పోయాడు.

"మా ఇంటికా? నా రూమ్‌కా?" అడిగాడు రవి.

ఆమె మౌనాన్ని బదులిచ్చింది.




ఆ మౌనాన్ని తన కోరికకు అర్ధాంగీకారంగా స్వీకరించాడు.

రిక్షాను పిలిచాడు.

ఇద్దరూ ఎక్కిన తరవాత, తన రూమ్‌కి పోనివ్వమన్నాడు.

రిక్షా రూమ్ ముందాగింది.

రవి రూమ్ తలుపులు తెరచి లోనికి ఆహ్వానించాడు ఆమెను. అతని వెంటే స్రవంతి గదిలోకి నడిచింది. తలుపులు బిగించి లోన గడియ పెట్టాడు.

ఆ రాత్రి —

ఆకాశంలో తారల మెరుపులు రెండూ ముద్దులాడుకున్నాయి.

విచ్చుకుంటున్న మొగిలి రేకుల పరిమళాన్ని గాలి మత్తుగా కౌగిలించుకుంది.

కొలనులోని రెండు కలువలు కలిసి కబుర్లాడుకున్నాయి.

ఆ రాత్రి వారిద్దరూ కోరికల వర్షంలో చిత్తుగా తడిశారు.

వారి స్మృతుల చరిత్ర పుటల్లో ఆ రాత్రి సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారు.

ఇన్నాళ్ళుగా వారు పండించుకున్న ప్రేమ పంట ఆ రాత్రి వారికి తీయని అనుభవాన్ని అందించింది.

## చేదు జీవితం :

గమనిక:— 'మద్రాసు నుండి బొకారో పోవు నైంటీ ఎక్స్‌ప్రెస్ మూడవ నంబరు ప్లాట్‌ఫారం మీదికి పది నిమిషాలలో రానున్నది' ఎనౌన్సర్ గొంతు మృదుమధురంగా వినిపించింది.

ఫస్ట్ ప్లాట్‌ఫామ్ మీద బుక్ స్టాల్లో పుస్తకాలను పరిశీలిస్తున్న రవి ఉలిక్కిపడి, బుక్ స్టాల్ నుండి థర్డ్ ప్లాట్‌ఫామ్ మీదికి వెళ్ళేందుకు ఓవర్ బ్రిడ్జి వైపు నడవ సాగాడు.

"హాయ్! రవీ!" ఎప్పుడో ఎక్కడో పరిచయమైన గొంతు విని వెనుదిరిగి చూశాడు.

ఫస్ట్ ప్లాట్‌ఫామ్ మీద ఆగి ఉన్న మెయిల్లోంచి, చేతిలో పుస్తకంతో ఆనందంగా వేగంగా దిగిందో యువతి.

'స్రవంతి! ...' రవి పెదవులు అస్పష్టంగా కదిలాయి.

భూకంపానికి హటాత్తుగా దారి మర్చిపోయి సెలయేరులా అప్పుడు నిష్క్రమించిన స్రవంతి ఇన్నాళ్ళ తరవాత!!

ఇన్నేళ్ళ తరవాత!!!

ఇప్పుడు ఇక్కడ! ఇలా, అనుకోకుండా!

"ఏమిటలా ఆశ్చర్యంగా చూస్తున్నావ్? నేను స్రవంతిని గుర్తుపట్టలేదా?" అడిగిందామె.

మార్పేమీ లేదు. అదే చురుకుదనం, కళ్ళలో అవే మెరుపులు, కాస్త తెల్లబడి లావెక్కింది!

"నిన్నెలా మరువ గలను స్రవంతీ! ఈ హటాద్దర్శనం నాలో కలిగించిన ఆశ్చర్యాన్ని అణచుకోలేక పోతున్నాను అంతే!" ఇంతలో ఆమె వెనకే ఒక పదేళ్ళ పాప 'మమ్మీ నేనూ దిగుతా' అంటూ దిగింది రవి వైపు ఆశ్చర్యంగా చూస్తూ.

"ఎలా ఉన్నావ్ రవీ! బాగున్నావా?'

"ఇదిగో ఇలా. ఉన్నాను!" తన గొంతులోని తీవ్రతకు తనే ఆశ్చర్యపోయాడు. "నువ్వు బాగున్నావా?'

"బాగానే ఉన్నాను. మా వారు భువనేశ్వర్‌లో 'అజంతా ప్రోడక్ట్స్'లో మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉంటున్నారు. ఇద్దరు పిల్లలు—ఒక పాప, ఒక బాబు.

ఇదిగో పాప 'అచ్యుత'. బాబుని కూడా నాతో తీసు కొస్తే ఆయన వంటరివా రవుతారని పంపలేదు. నా ఫ్రెండ్ మారేజికి వెళ్ళొస్తున్నాను. ఇదిగో ఇప్పుడే నీ కవితా సంకలనం 'నక్షత్రం రాలిన రాత్రి'ఇక్కడ కనిపిస్తే కొని చదువుతున్నాను..."గలగలా వివరాలన్నీ చెపుతూ పుస్తకాన్ని చూపించింది.

"నీ కెందరు పిల్లలేమిటి?" అడిగింది.

"ఇద్దరు ... పుట్టి ఉండేవారు పెళ్ళిచేసుకుని ఉంటే."

"ఏమిటీ! నువ్వింకా పెళ్ళి చేసుకోలేదా? ఏం?"

"నిన్ను తప్ప మరొకర్ని నా జీవితంలోకి ఆహ్వానించలేక."

స్రవంతి బాధతో ముఖం కిందకు దించుకుంది. చేతిలోని కవితా సంకలనం తెరుస్తూ "అయితే ఈ కవిత నన్ను ఉద్దేశించే రాశావన్న మాట" అంటి ఆఖరు పేజీలోని కవితను చూపిస్తూ. రవి ఆ కవిత వైపు దృష్టి మరల్చాడు.

ఈ జన్మ కిక
నువు నా హృదిలో
మెదలని క్షణ మంటూ ఉండదు
నిరంతరం రగులుకునే
ఈ జ్ఞాపకాల చితి ఇక ఆరదు
జీవితాన్ని ఇందులో తగలేసి
బూడిదగా మార్చేసి,
తృప్తిపడతాను.
నిను ప్రేమించినందుకు
నువు నా కిచ్చే కానుక ఇదేనని!

రవి జవాబు చెప్పలేదు.

"రవీ! మనం జీవితంలో ఎన్నో అనుకుంటాం. అనుకున్న వన్నీ జరగవు. కొన్ని కోరికలు కోరికలుగానే మిగిలిపోతాయి. ఏ కొన్ని కోరికలో ఫలించి స్మృతు లౌతాయి. ఆ స్మృతులకు చావుండదు, రవీ! అవి నిరంతరం నిత్య నూతనంగా ఉంటాయి. జీవిత సమరంలో మనం అలసిపోయిన క్షణాల్లో ఆ 'స్మృతుల మననం' మనకు గొప్ప శక్తినిస్తుంది. ఆ శక్తి చాలు ఈ జీవితాన్ని ఈదడానికి. జీవితం మనకు ఒక్కసారే ప్రసాదింప బడుతుంది, రవీ! కొన్ని కొన్ని పరిస్థితులలో రాజీ పడక తప్పదు"నిట్టూర్పుతో చెప్పడం ఆపింది స్రవంతి.

ఆశ్చర్యంగా స్రవంతి వైపు చూశాడు రవి- స్రవంతి ఎప్పుడు ఇంతగా ఎదిగిందా అని.

"సరే ! నువ్వేమిటిలా వచ్చావ్?" వాతావరణాన్ని తేలిక పరుస్తూ అంది.

"ఆఁ ... నేను ... మా ఫ్రెండ్‌ని రిసీవ్ చేసు కోవడానికి."

మెయిలు బయలుదేరబోతున్నట్టు కూత కూసింది.

స్రవంతి పాపతోసహా రైలెక్కింది. బాగ్‌లోంచి విజిటింగ్ కార్డు తీసి "ఇదిగో రవీ! ఇది నా అడ్రస్. నీ పెళ్ళికి కార్డు పంపించు—తప్పకుండా వస్తాను" అంటూ అందించింది.

అప్రయత్నంగానే అందుకున్నాడు.

మెయిల్ కదిలింది. స్రవంతి, పాపతో సహా 'టాటా' చెపుతోంది ... మసగ్గా మసకమసగ్గా రూపం దూరమయింది.

వెనుదిరిగాడు రవి. థర్డ్ ప్లాట్‌ఫామ్ వైపు నడుస్తున్నాడు. "నిజమే స్రవంతీ! సునస్మృతులకు చావులేదు. అవి నిత్య నూతనం... అందుకే నిన్ను నేను మరువలేను. మరొకర్ని ఆహ్వానించలేను ... జీవితంతో రాజీపడ్డం నాకు రాదు..."

"ఒరేయ్! రవీ! ఇదిగోఇక్కడున్నాను"- ఆలోచనల మధ్య పెట్టెను దాటిపోతున్న రవి అతని మిత్రుని పిలుపుతో ఆలోచనల్లోంచి జీవనసమరంలో పడ్డాడు.

[ ఈ కథాగమనం కోసం గుంటూరు శేషేంద్రశర్మ, తిలక్ రాసిన కొన్ని కవితల్ని వాడుకున్నాను ఇందుకు—

శేషేంద్రకి కృతజ్ఞతలు
'తిలక్'కి స్మృత్యాంజలి

-జ్యోత్స్న )





ఆ మీ కోరిక తీరేందుకు నేడే పథకం వేయండి.వెనువెంటనే స్టేట్ బ్యాంక్‌కి విచ్చేయండి.

తల్లిదండ్రులందరూ తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు గురించి కలలు కంటారు. అయితే కాలమన్నది ఎంత వేగంగా సాగిపోతుందో ఆ రేపన్నది ఎంత త్వరగా వచ్చేస్తుందో ఏ తల్లి దండ్రీ ఊహించరు. దూరదృష్టి లేక పోవడం వల్ల ఆలోచించి పథకం వేయక పోవడం వల్ల ఎన్నో సార్లు మన కలలన్నీ కల్లలయి పోతాయి.

స్టేట్ బ్యాంక్‌లో మా వద్ద ప్రతివారి కల నిజమయేందుకు ప్రతివారి కోసం ఒక్కొక్క పథకం ఉంది—రీఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (తిరిగి మదుపు ప్రణాళిక), రికరింగ్ డిపాజిట్ స్కీమ్ (పునరావృత్తి డిపాజిట్ పథకం), సేవింగ్స్ ఎకౌంట్ (సేవింగ్స్ ఖాతా), టర్మ్ డిపాజిట్, జనతా డిపాజిట్, మైనర్ల ఎకౌంట్ (మైనర్ల ఖాతా), పెరీనియల్ పెన్షన్ ప్లాన్ (నిరంతరం పింఛన్ ప్రణాళిక)-వీటిలో మీకు అనువైన దానిని ఎన్నుకోండి.

పొదుపు చేసేందుకు

స్టేట్ బ్యాంక్

భారతదేశంలో అత్యంత పెద్దదైన బ్యాంక్

CHAITRA-SBI-628 TEL